కథ

ఒకే కంపార్ట్‌మెంటులో ఎదురుబొదురు సీట్లలో నేనూ-అతడు. 'సమ్మోహనం' అతని చిరునవ్వు. పదే పదే చూడాలనిపిస్తూంది. మనసనేదుండే అది మహా చెడ్డది. ఇలాటి విషయాల్లో కళ్ళెంవేసి వెనుక్కుపట్టి లాగితేతప్ప మనమాట వినదు. ఇప్పటి నా పరిస్థితి అదే-అయింది.

# సమ్మోహనం

మొదటిసారి ఏదో యథాలాపంగా చూసాను. తళుక్కున మెరుపు మెరిసినట్లు నవ్వాడు. పరిచయమున్న వ్యక్తిలా-నూటిగా! కళ్ళతో పలకరింపుగా. ఎంతేమందిలో ఉండే వెకిలితనం, కల్మషం మచ్చుకైనా కనిపించ లేదు.

రెండవసారి మనసు చేసే తొందరకు తట్టుకోలేక 'ఓరగా-దొంగలా' చూసాను. కొంచెం పరిశీలనగా. సన్నగా-చామన చాయతో చాలా సాదాగా ఉన్నాడు. వైట్ షర్ట్ టక్ చేసాడు లైట్‌బ్రౌన్ కలర్ పాంట్‌లో!

సిగ్గువిడిచి అతని వైపు ఎలా చూట్టం. 'బరితెగించిన ఆడది' అని అనుకోడూ! అలా అనుకోవడం తనకు యిష్టం లేదు ఎంత మాత్రం! కానీ, నా మనసు ఏమాత్రం నాతో సహకరించలేదు. అందుకే అతడు ఎటో చూస్తుండగా చూసేసాను-తెగించి.

హఠాత్తుగా నావైపు తల త్రిప్పాడు. అదే! 'సమ్మోహనాస్త్రం!' నవ్వీనవ్వనట్లుగా చూసి చేతిలో ఉన్న వీక్లీ వైపునకు తలదించుకున్నా 'పట్టుబడిన దొంగ'లా!

"ఎక్కడిదాకా వెళుతున్నారు?" వినిపించింది ప్రశ్న.

కొంచెం బిడియమనిపించింది. మెల్లగా తలపైకెత్తి "భీమవరం" జవాబిచ్చాను.

"మీరేం చేస్తుంటారు?" మళ్ళీ ప్రశ్న.

"ఎమ్.సి.ఎ. చేస్తున్నాను" నా సమాధానం.

"భీమవరంలోనా? ఫైనలియరా?"

"ఊ" సమాధానం 'ఇతనికెలా తెలుసా' నా సందేహం!

"ఎక్కణ్నుండొస్తున్నారు?" అతని ఆరా.

"తిరుపతి నుండి" నా సమాధానం.

"అక్కడెవరైనా.." అతడి ప్రశ్నను మధ్యలోనే అడ్డుకొన్నాను.

"నాన్నగారు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా చేస్తున్నారు. రెండ్రోజులు శెలవుమీద చూడ్డానికి వెళ్ళాను" చెప్పాను.

"మీ పేరు తెలుసుకోవచ్చా?" మర్యాద తొణికిసలాడింది కంఠంలో.

"వసుంధర" చెప్పాను.

"మీ నాన్నగారు పేరు యార్లగడ్డ కృష్ణచైతన్యగారు కదూ?"

"మీకెలా తెలుసు?"

అతను కొంచెం కంగారును సర్దుకుంటున్నట్లుగా కనిపించాడు.

"అహ! పేపర్లో చూసాను" అన్నాడు.

అంతటితో మా యిద్దరి మధ్య సంభాషణ కట్టైపోయింది అప్పటికి.

ఓ పది నిముషాలాగిం తరువాత అతడే మాట్లాడాడు-"మిమ్మల్ని గురించి యిన్ని వివరాలడిగాను కదా? నన్ను గురించి ఏమీ తెలుసుకోవాలనిపించటం లేదా?" అదే చిరునవ్వు.

"చెప్పండి!" అన్నాను చిరునవ్వుతో

"నా పేరు విష్ణువర్ధన్. మద్రాసులో కంప్యూటర్ ఇంజనీరుగా చేస్తున్నా. అమ్మానాన్నా చెల్లాయి నాతోనే ఉంటారు. నాకింకా వివాహం కాలేదు. నాలుగేళ్ళనుండి ఏవో సంబంధాలు చూస్తూనే ఉన్నారు. వాటిలో ఏ ఒక్కటీ నచ్చలేదు. ఎంత తొందరగా నన్నో అమ్మచేతిలో పెట్టాలా అని మావాళ్ళ తొందర. అదే పనిలో ఉన్నారు ఇదీ బ్రీఫ్‌గా నాకథ." అన్నాడు విష్ణువర్ధన్.

మళ్ళీ అతనే "ఇప్పుడు విజయవాడ పనిమీద వెళుతున్నానుకోండి" అన్నాడు కొనమెఱుపులా.

కిసుక్కున నవ్వాన్నేను అతడన్నమాటకు చివరిగా.

అతడు నన్ను ప్రశ్నార్థకంగా చూస్తూ "ఎందుకు నవ్వారు? నేనేమన్నా తప్పుగా మాట్లాడానా?" అన్నాడు.

"అబ్బే అదేం లేదు. అందరూ ఓ అయ్య చేతిలో పెట్టాలంటారు కదా? మీరేంటి రివర్సులో అంటున్నారు?" అన్నాను.

"ఓ అదా! నేను ఆడపిల్లను కాదు గదండీ! అందుకే అలా అన్నా! అందులో తప్పేముంది? చక్కని ఓ మంచి భార్యకు చేతినందివ్వడంలో సుఖం-శాంతి యిమిడి ఉంటాయని నా భావన. మీరేమంటారు?"

"పురుషాహంకారం దెబ్బతింటుందేమో!" అన్నాన్నేను కూడా సూటిగా.

"ఇందులో పురుషాహంకారం దెబ్బతినటం అంటూ ఏమీ ఉండదు సుమండీ! ఎందుకంటే సంసారపుబండికి రెండు చక్రాల్లాంటివాళ్ళు భార్యాభర్తలు. మగవాడిదేముందండీ, ఇల్లు-ఇల్లాలు-పిల్లలు అన్నారుకాని, ఇల్లు-ఇంటాయన-పిల్లలు అనలేదుకదా!" అన్నాడు సాలోచనగా చూస్తూ.

"వాస్తవాన్ని కాదనటానికి మనకేం అధికారముందిలెండి?" అన్నాన్నేను.

"చూడండి. ఈ సీట్ల మీద మనమిద్దరమే ఉన్నాం కనుక ఖరిపోయింది. లేకపోతే నా మాటలకు నవ్వుకునే వాళ్ళేమో కదండీ!" అన్నాడు నవ్వి.

నేనూ నవ్వుతూ "ఇద్దరమేమిటండీ! ఆ..పక్క సీట్లలో నిద్రపోతున్న ఆ ఇద్దరి మాటేమిటి?" అన్నాను.

అతనితో మాట్లాడిన ఈ కొద్ది పరిచయంలోనే అతని సౌందర్య రహస్యాన్ని బాగా కనిపెట్టేశాను. కల్మషరహితమైన నిర్మలంగా, నల్లగా మిలమిలా మెరిసిపోయే అతని కళ్ళు అతని హృదయసౌందర్యానికి తెరిచిన కవాటాల్లా ఉన్నాయి. ఆ నిర్మలత్వాన్ని ఇనుమడింపజేస్తూ..ఎంతటివారినైనా ఇట్టే బుట్టలో వేసుకోగలదనటానికి తార్కాణమైన 'స్నేహార్ద్ర సమ్మోహన హాసరేఖ'.

మాటల్లో టైం బాగా పాసైంది. విజయవాడ స్టేషన్‌లో ఆగింది ట్రైన్. విష్ణువర్ధన్ లేచి బ్రీఫ్‌కేస్ చేతికి తీసుకున్నాడు. నేను కూడా నా బాగ్ తగిలించుకున్నాను. వాచ్ చూసాను. తొమ్మిదిన్నర కావచ్చింది. మళ్ళీ బస్సందుకోవాలి.

"హలో! వసుంధరగారూ! వెళ్ళొస్తానండీ. మంచి కంపెనీ యిచ్చారు. ఒక ఆడపిల్లతో యింతసేపు మాట్లాడటం నా జీవితంలో ఇదే తొలిసారి. ఈరోజుని జీవితాంతం మనసులో దాచుకుంటాను. ఆ మీరు బస్సుకు వెళ్ళాలి కదా! నేను కూడా అలా బస్సు దాకా వస్తానండీ!"

వ్యక్తిగా అతనేమిటో అర్థం అయిన తరువాత నాలో అంతకు మునుపున్న కొద్దిపాటి బిడియం మటుమాయమైంది. "అలాగే!రండి!" అన్నాను స్నేహపూర్వకంగా.

బస్ కౌంటర్ దగ్గరకు వెళ్ళి టికెట్ తెచ్చిపెట్టాడు అతనే. సన్నగా ఉన్నా, అతని నడకలో హుందాతనం కొట్టొచ్చినట్లు కనబడుతూంది. ఓ పది నిముషాల్లో బస్ రావటం ఆడవాళ్ళ సీట్లో కిటికీ ప్రక్కగా సీట్లోకి తన ఖర్చీఫ్ వేసి ముందున్న జనాన్ని నెట్టుకుంటూ .."రండి!" అన్నాడు నావైపు చూస్తూ.

నేనూ అతన్ని అనుసరించి వెళ్ళి సీట్లో కూర్చున్నాను.

"వస్తాను మళ్ళీ..జీవితంలో ఎప్పుడైనా కలుస్తామంటారా?" అన్నాడు ఏదో బాధాజనిత భావం ధ్వనించిందతని కంఠస్వరంలో.

నన్నూ..చెప్పలేనిదేదో ఒక 'అవ్యక్తభావం' కుదిపేసింది.

"నమస్తే! మీ సహాయానికి" అంటూ చేతులు రెండూ జోడించాన్నేను.

బస్సు దిగాడు విష్ణువర్ధన్. స్పీడందుకుంది బస్సు.

జరిగిందంతా నెమరు వేసుకున్నాను. "ఏమిటీ..వింత పరిచయం?" అనుకుంటూ సీటుకు తలానించాను.

★★★

కృష్ణమూర్తి ఆఫీసునుండి ఆత్రుతతో ఆనందంగా

వచ్చాడు యింటికి. వస్తూనే "సత్యా!సత్యా!" అంటూ పిలిచాడు.

లోపలి నుండి "ఏవిటీ హడావుడి!" అంటూ వచ్చింది పవిట చెంగుకు చేయి తుడుచుకుంటూ సత్యవతి.

"ఏవిటంటావేమిటోయ్! శుభవార్తోయ్! శుభ వార్త!"

"ఏవిటో ఆ శుభవార్త!"

"మరేం లేదోయ్! మద్రాసు నుండి ఆ అబ్బాయి తండ్రి జాబు వ్రాశాట్ట వాళ్ళ బాబాయి వామనరావుకి. వచ్చే పంచమీ బుధవారం అమ్మాయిని చూసుకోవటానికి వస్తామని. ఇంకా నాలుగు రోజులుంది. మరి, అమ్మాయికి టెలిగ్రామివ్వనా? ఏమంటావోయ్?" అన్నాడు.

"భలేవారే! నేనేమంటాను? మీ మాట నేనెప్పుడు కాదన్నాను గనుకా?" కొంచెం సాగదీసింది సత్యవతి.

"లేదనుకో! అర్ధాంగివి కదా! నీ అంగీకారం ఉండద్దూ?"

"చాల్లెండి! కుర్రతనపు వేషాలూ మీరూ" మూతి మూడు వంకర్లు తిప్పింది.

"వస్తా! అయితే!" అంటూ బయటికి పరిగెత్తాడు కడుపునిండిన ఆనందంతో.

***

టెలిగ్రాం యిచ్చిన రెండోరోజు సాయంకాలం ఐదు గంటలకు రిక్షా దిగింది వసుంధర. వస్తూనే "ఏంటమ్మా! అంత అర్జంటుగా టెలిగ్రామిచ్చారు?" ప్రశ్నించింది తల్లిని చూస్తూ.

సత్యవతి నవ్వుతూ "కాళ్ళూ చేతులూ కడుక్కొని ముందు కాఫీతాగు-తర్వాత మాట్లాడుకుందాం" అన్నది.

తల్లి చేతిలో కాఫీ గ్లాసందుకుంటూ "నాన్నగారింట్లో లేరా?" అన్నది వసుంధర.

"మరే! నీవు వస్తావని చూసి చూసి యిప్పుడే అలా సెంటర్‌లోకి వెళ్ళొస్తానని వెళ్ళారు"

"సరే! యిప్పుడు చెప్పు. ఎందుకిచ్చారు టెలిగ్రాం!"

"ఎందుకేవిటి! ఏదో మంచి సంబంధం కుదిరేట ట్లుంది. వాళ్ళు పిల్లను చూసుకోవటానికి వస్తామని రాశారు. అదీ రేపే! ఉత్తరం రాద్దామంటే వ్యవధిలేదు. అందుకే టెలిగ్రామిచ్చారు మీ నాన్న"

"చెప్పానుకదమ్మా! ఈ సంవత్సరంలో చదువైపో తుంది కదా! యింతలో అంత తొందరెందుకే?"

"అనుకున్నప్పుడల్లా మంచిసంబంధం కుదరా లంటే కుదుర్తుందా? చెప్పు? ఏదో..నీ రాత బాగుండ బట్టి కలిసొచ్చింది. కాదనుకుంటే..మాటలా! ఆలో చించు! చదువుదేముంది..ఆ మూడుముళ్ళు పడి నెత్తిన నాలుగక్షింతలు పడనీ! ఆ తర్వాత చదువుపూర్తి చేద్దూగాని. వాళ్ళతో మీ నాన్న మాట్లాడుతారు"

"ఏ ఊరమ్మా?" కుతూహలంగా అడిగింది వసుంధర.

"స్వస్థలం కృష్ణాజిల్లాలో ఏదో ఊరట. పిల్లవాడి ఉద్యోగరీత్యా మద్రాసులో స్థిరపడ్డారుట. పిల్లవాడి బాబాయి ద్వారా తెలిసింది. ఆయన మీనాన్నగారి ఆఫీసులోనే పన్జేస్తున్నాడు" కూతురికి వివరాలు చెప్పింది సత్యవతి.

వసుంధర తల్లికి ఎదురు చెప్పలేదు.

***

బుధవారం రానే వచ్చింది. ప్రయత్నాలన్నీ చేసుకొని పెళ్ళివారి రాకకోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు.





పురాణం శేషశారద

ఎంతకూ వారి జాడ లేదు. కృష్ణమూర్తి సత్యవతి ఇంట్లోకీ..బైటికీ..బైటికీ..ఇంట్లోకీ తిరిగి చూస్తున్నారు. ఇంతలో వాకిటి గుమ్మంలో హడావిడిగా వామనరావు పెళ్ళి కొడుకు బాబాయి ప్రత్యక్షమైనాడు.

"సారీ! కృష్ణమూర్తిగారూ? మావాళ్ళకేదో యిబ్బంది వచ్చి పడిందట. రాలేకపోయినందుకు ఏమీ అనుకోవద్దని ఇంకో పదిహేనురోజుల తరువాత తప్పకుండా వచ్చి అమ్మాయిని చూస్తామని నాకు ఫోను చేసి చెప్పారు ఇప్పుడే! వెంటనే నేను పరిగెత్తుకుంటూ వచ్చాను" అంటూ కృష్ణమూర్తి రెండు చేతులూ పట్టుకున్నాడు.

కృష్ణమూర్తి మాత్రం ఏం చేస్తాడు పాపం. హతాశుడైనాడు. పైకి తేలకుండా కొంచెం బెట్టుగానే.."అలాగా పాపం! పోనీలెండి! యింకా కళ్యాణ ఘడియలు సమీపించలేదు కాబోలు" అన్నాడు నవ్వుతూ.

సత్యవతికీ బాధగానే ఉంది మనసులో.

"మూర్తిగారూ! మీరు మరోవిధంగా అనుకోవద్దు. ఎందుకంటే..అమ్మాయి ఫొటో పంపించాం కదా! అది చూసాకే కదా..మావాళ్ళు చూపులకు వస్తామని రాశారు. కనుక మీరు నిశ్చింతగా ఉండండి. పూచీనాది" అన్నాడు వామనమూర్తి హామీగా!

"అయ్యో! ఎంతమాట. మీ మాటకు తిరుగేముంది? అలాగే. రండి. కొంచెం కాఫీ తాగి వెడుదురు గాని రండి!" అంటూ చేయి పుచ్చుకుని తీసుకొని వెళ్ళి కుర్చీలో కూర్చోపెట్టి ఫలహారం ప్లేటు చేతికిచ్చాడు.

వామనమూర్తి మొహమాటంగానే తీసుకొని నోట్లో వేసుకుంటూ

"అయితే...అమ్మాయి శెలవు ఎన్నాళ్ళు ఉందేవిటి?" అడిగాడు.

"ఎన్నాళ్లో ఎక్కడిదండీ? రేపే బయలుదేరి వెళుతుంది. ఫైనలియరు కదా?"

"అలాగా..ట్రైన్లోనా? బస్‌లోనా?" మాటవరసకు అడిగినట్లుగా అడిగాడు వామనరావు.

"ట్రైన్లోనేనండీ!" చెప్పాడు కృష్ణమూర్తి.

కాఫీ తాగి లేచి "వెళ్ళొస్తానయ్యా! అమ్మా వెళ్ళొస్తా!" అని చెప్పి నింపాదిగా వెళ్ళిపోయాడు వచ్చిన పని అయిపోయిందన్నట్లుగా వామనమూర్తి. వసుంధరకు కొంచెం నిరాశనిపించింది.

***

మర్నాడు గురువారం పాసింజరుకు బయలుదేరింది వసుంధర.

తల్లీతండ్రీ యిద్దరూ స్టేషనుకు వచ్చి రైలెక్కించారు కూతుర్ని.

కృష్ణమూర్తి దంపతులకు కూతురైనా కొడుకైనా వసుంధరొకతే. పంచప్రాణాలు ఆమె మీదనే పెట్టుకొని బ్రతుకుతున్నారు. అపురూపంగా ఏలోటూ రానివ్వకుండా పెంచుకొచ్చారు. కూతురి మాటకెదురు చెప్పలేదు, వసుంధర ఎమ్.సి.ఎ. చేస్తానన్నప్పుడు. భీమవరంలో సీటొచ్చింది. రెండేళ్ళు గడిచాయి. ఇది ఆఖరి సంవత్సరం. అందుకే వెంటనే బయలుదేరింది.

***

భీమవరం చేరిన వసుంధరకు మూడవరోజున ఓ కవరు తెచ్చియిచ్చాడు పోస్టుమాన్. "ఎక్కడి దబ్బా..నిన్ననేగా యింటి నుండి వచ్చింది. యింతలోనే.." అనుకుంటూ ఫ్రమ్ ఎడ్రసు చూసింది. ఎక్కడేమీ లేదు. కవరు చింపి కాగితం చేతికి తీసుకొని విప్పి చూసింది ఆత్రంగా! ముత్యాలు పేర్చినట్లుగా ఫస్టులైన్‌లో తన పేరు చూసి ముచ్చటపడింది. 'ఎంత బాగుంది' అనుకుంటూ కళ్ళు అక్షరాల కూర్పు వెంట పరిగెత్తించింది.

మద్రాసు

3-5-2001

వసుంధరగారూ!

ఆశ్చర్యపడకండి. ఈ లెటర్ వ్రాయటానికి గొప్ప సాహసం, ధైర్యం కూడగట్టుకోవలసి వచ్చింది సుమండీ! నాకు ఎక్కువగా ఉత్తరాలు రాసే అలవాటు లేదు. అందునా ఆడపిల్లలకు ఆమడదూరంలో ఉంటాను. ఇప్పుడు ఈ ఉత్తరం రాయాలంటే దాదాపు తెగించానన్నమాటే! తప్పదుమరి.

ఇంక అసలు విషయం-మీ నాన్నగారు పనిచేసే ఆఫీస్‌లోనే మా బాబాయిగారు కూడా పనిచేస్తున్నారు. వారితో మీ నాన్నగారు ఏదైనా ఒక మంచి సంబంధం చూడమని చెప్పారుట. బాబాయిగారు 'మా అన్నగారి కుమారుడు మద్రాసులో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. మీరు కావాలంటే మావాళ్ళతో మాట్లాడుతా'నని చెప్పారుట. మీ నాన్నగారు సరేనన్నారుట. బాబాయిగారు మీ కుటుంబ విషయాలన్నీ సవివరంగా 'మీ ఫొటో'తోసహా తెలియజేసి పిల్లను చూడటానికి రమ్మనమని రాశారు. కానీ, నాకు అనవసరమైన 'ఫార్మాలిటీస్' నచ్చవు. మా బాబాయిగార్కి వేరే మార్గం చూడమని రాశాను. బాబాయి వెంటనే మీరు ఫలానారోజు, ఫలానాటైంలో, ఫలానా బండికి బయలుదేరుతున్నట్లుగా ఫోను చేసి చెప్పారు. ఆవిధంగా మీ ఫొటో పట్టుకొని బయలుదేరాను. మొత్తం మీద మిమ్మల్ని గుర్తుపట్టగలిగాను. మీకు ఎదురుబెర్తులోనే కూర్చున్నాను. ఆ తరువాత జరిగిందంతా మీకు సువిదితమే!

ఇకపోతే-ముఖ్యవిషయం, డీప్‌గా ఆలోచించండి.

నాకు మంచి ఉద్యోగం, జీతం ఉన్నాయి. భార్యను చక్కగా చూసుకోగలిగే సున్నితమైన మనసు, ప్రేమించే సహృదయత భగవంతుని దయవల్ల నాకున్నాయి. కానీ, ఈకాలం ఆడపిల్లలు కోరుకునే లక్షణాలు నాకు ఏ ఒక్కటీ లేవు. నేను ఎంతమాత్రం అందగాణ్ణి కాదు. సాదాసీదా వ్యక్తిని. అది మీకు ప్రత్యేకించి నేను చెప్పనవసరం లేదు. మీరు నన్ను యిష్టపడినట్లైతే నాకు తెలియజేయండి.

వివాహం అనేది నూరేళ్ళపంట. ఆ పంట సవ్యంగా పండాలేకాని మొలకలోనే దానికి చీడ పట్టకూడదని నా అభిప్రాయం.

పోతే నా నిశ్చయం: మిమ్మల్ని చూడగానే ఒక్కసారిగా మీ అందం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ముఖ్యంగా మీ అణకువ. మీ కట్టు, బొట్టు తీరు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న-నేను కోరుకుంటున్న ముగ్ధ సుందరి సాక్షాత్కరించినట్లైంది. నా మనసులోనే 'ఓకే' చేసుకున్నాను. మీరు నా చేయందుకుంటే..నా అంత అదృష్టవంతుడుండడని నా అభిప్రాయం. సాధ్యమైనంత త్వరలో మీ సమ్మతిని తెలియజేస్తారని ఎదురుచూస్తుంటాను.

-విష్ణువర్ధన్.

ఆ ఉత్తరం ఆసాంతం చదువుకున్న వసుంధర ఇదీ..అని చెప్పలేని చిత్రమైన అనుభూతికి లోనైంది. మనసుకు అంతుచిక్కని సంతోషభావనావీచిక తాకినట్లు, ఏదో తృప్తి. ముఖమంతా వికసించిన మందారమైంది. పదిలంగా ఉత్తరం మడిచి సూట్‌కేసులో దాచుకొంది.

రెండురోజులు బాగా ఆలోచించింది. ఆ రాత్రి విష్ణువర్ధన్‌కు జవాబు రాయటం మొదలుపెట్టింది.

భీమవరం,

6-5-2001.

విష్ణువర్ధన్‌గారికి,

మీ లెటర్ అందుకున్నాను.

ఒక్కసారిగా ఆశ్చర్యంతో నన్ను నేను నమ్మలేకపోయానంటే నమ్మండి. కొంచెం కోపం కూడా వచ్చిందనుకోండి. అయినా ఫరవాలేదులెండి. పెళ్ళిచూపుల ఫార్మాలిటీతో ఓ పదినిమిషాల్లో ఒకరినొకరు 'ఓకే' చేసుకొనే సాంప్రదాయాన్ని కాలదన్నినందుకు మీకు ఓ.కె. మిమ్మల్ని గురించి మీరు కించపరుచుకుంటూ 'నేను అందగాణ్ణి కానని'వ్రాశారు. అందమంటే ఏమిటండీ..అసలు?

మీరు సినిమా హీరోలా లేని మాట వాస్తవమే!

నా మనసులోని అభిప్రాయం దాచుకోకుండా నిర్మొహమాటంగా చెప్పటం నా స్వభావం. నేను కొంచెం మాటకారిని-గడుసుపిండాన్ని సుమండీ! అంతమాత్రాన నన్నో గయ్యాళిగానో, రాక్షసిగానో ఊహాచిత్రం గీసుకున్నారనుకోండి పప్పులో కాలేసారన్నమాటే! ఏమిటో ఈ అమ్మాయికింత పొగరు? అని కూడా అనుకోవచ్చు. అదేమీకాదు. మనసువిప్పి యిప్పుడే మీరడిగినదానికి జవాబు చెప్పినట్లైతే ఆ తరువాత వచ్చే అటుపోట్లు ఎదుర్కోవలసిన పరిస్థితి రాదని నా ఖచ్చితమైన అభిప్రాయం. ఏమంటారు?

అసలు పాయింటు: మీరు నాకు బాగా నచ్చారు. అలా సందేహంగా చూడకండి మరి. మొదటిసారి నన్ను చూసి రైల్లో మీరు పలకరింపుగా నవ్విన 'ఆ చిరునవ్వు' చాలు. కట్టుకున్న ఆడది మీ నీడలో పదికాలాలు చల్లగా, నిర్భయంగా, నిశ్చింతగా మనుగడ సాగించగలదని చెప్పటానికి. పసిపాపాయి నవ్వులా, స్వచ్ఛంగా సమ్మోహనంగా మైమరపించే ఆ మీ చిరునవ్వు నా బ్రతుక్కొక ఆలంబన కావాలి.

మీరు నా వెంట వచ్చి నన్ను బస్సు ఎక్కించిన వైనం చాలు మీ చేయందుకున్న నాకు మీరొక రక్షణ కవచమని. మీ గాంభీర్యం వెనుక సున్నితంగా శాసించగల మగసిరి దాగుందని. ఇంతకంటే ఏం చెప్పను! టోటల్‌గా మీరొక 'సమ్మోహనం'. మీ నీడలో నాకు చోటు కల్పిస్తానంటే కాదని కాలదన్నుకునే వెర్రిదాన్ని కాదు. మీదే ఆలశ్యం. నమస్సులతో.

-వసుంధర.

